క్లుప్తంగా

నూతన వధూవరులకు ఆశీర్వాదం



నూతన వధూవరులతో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తదితరులు

పులివెందుల రూరల్ : పులివెందుల మండల పరిధిలోని నల్లపురెడ్డిపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎన్నారై సుబ్బారెడ్డి కుమారుడి వివాహ వేడుక పట్టణంలోని స్థానిక ఎస్సీఎస్ఆర్ కల్యాణ మండపంలో జరిగింది. ఈ వివాహ వేడుకకు కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి హాజరై నూతన వధూవరులు రాహుల్‌కుమార్‌రెడ్డి, రూప మనోజ్ఞలను ఆశీర్వదించారు. ఆయనతోపాటు వైఎస్సార్‌సీపీ నాయకులు బలరామిరెడ్డి, బయపురెడ్డి, హేమాద్రిరెడ్డి, సతీష్‌రెడ్డి కుమారుడు రోహన్ నాగిరెడ్డిలు వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.

తెలుగు క్యాలెండర్ల అందజేత

పులివెందుల టౌన్ : పట్టణంలోని భాకరాపురంలోని స్థానిక వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయంలో బుధవారం కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డిలను రాయల్ కాపు నాడు రాష్ట్ర అధ్యక్షుడు గంగల వీరాంజనేయులు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కావలి కృష్ణతేజలు కలిసి రాయల్ కాపునాడు నూతన తెలుగు క్యాలెండర్లను అందజేశారు. కార్యక్రమంలో రాయల్ కాపునాడు సంఘ రాష్ట్ర కార్యదర్శి మూర్తి శ్రీనివాసులు రాయల్, కాపునాడు గౌరవ సభ్యులు కావలి హరినాథ్, పాలెం రంగనాథ్, సర్పంచ్, పలువురు రాయల్ కాపునాడు నాయకులు పాల్గొన్నారు.

కొత్త కార్డుకు కష్టాలు

ఎర్రగుంట్ల (జమ్మలమడుగు) : కొత్త రేషన్‌కార్డులకు దరఖాస్తులను స్వీకరిస్తామని ప్రభుత్వం ప్రకటించిన ఆనందం ఆన్‌లైన్ కష్టాలతో ఆవిరైపోతోందని ఎర్రగుంట్ల సీపీఐ పట్టణ కార్యదర్శి శరత్‌కుమార్ పేర్కొన్నారు. దరఖాస్తులకు పెట్టిన నిబంధనలతో ప్రజలు సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారని తెలిపారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకునేందుకు వచ్చిన ప్రజలకు తిప్పలు తప్పడం లేదన్నారు. దీనికి తోడు సర్వర్ డౌన్ కావడంతో సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తుందని తెలిపారు. పౌరసరఫరాల మంత్రి వివాహ ధ్రువీకరణ పత్రం అవసరం లేదని చెబుతున్నారని, ఆన్‌లైన్‌లో మాత్రం కచ్చితంగా కావాలనే ఆప్షన్ పెట్టారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకుడు ప్రసాద్, నాగార్జున, మల్లి తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీతో పశువుల దాణా

పెండ్లిమర్రి : పాడి రైతులకు యాభై శాతం సబ్సిడీతో పశువుల దాణా, పశుగ్రాస విత్తనాలు మంజూరైనట్లు పశువైద్యాధికారి సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి విడతగా 7 టన్నుల దాణా అందుబాటులో ఉందన్నారు. ఒక్కో పాడి రైతుకు 50 కేజీలు మాత్రమే ఇస్తామన్నారు. 50 కేజీల బస్తా ధర రూ.1100లు సబ్సిడీ పోను రూ.555 చెల్లించి పాడి రైతులు తీసుకెళ్లాలని ఆయన కోరారు.

సర్పంచ్ చొరవతో పారిశుద్ధ్య చర్యలు

వేంపల్లె : వేంపల్లి గ్రామ పంచాయతీలో సర్పంచ్ ఆర్.శ్రీనివాసులు చొరవతో పారిశుద్ధ్య మెరుగునకు చర్యలు తీసుకున్నారు. బుధవారం స్థానిక ఎస్సీ కాలనీలో పారిశుద్ధ్య పనులను చేపట్టారు. నెల రోజులుగా కాలువలో చెత్తాచెదారాలు చేరుకుపోయి మురుగునీరంతా రోడ్డు పైకి వస్తోంది. దీంతో వార్డు మెంబర్ బాబయ్య సర్పంచ్ దృష్టికి తీసుకురావడంతో వెంటనే స్పందించి సమస్యలు పరిష్కారానికి కృషి చేశారు. దీంతో ఆ కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. అంతేకాకుండా పారిశుద్ధ్యం, డ్రైనేజీ, తాగునీటి సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని సర్పంచ్ కోరారు.

ఆలయానికి అఖండ దీపాలు బహూకరణ

ముద్దనూరు : మండలంలోని బొందలకుంట గ్రామంలో వెలసిన బసవేశ్వరస్వామి ఆలయానికి రెండు అఖండ దీపాలు, గంటను దాత బి.మునిరెడ్డి బహూకరించారు. బుధవారం ఆయన సుమారు రూ.25వేల విలువ కలిగిన దీపాలు, గంటను ఆలయంలో అర్చకుడు అనిల్‌కుమార్‌కు అందించారు. శ్రీబసవేశ్వర స్వామి ఆశ్రమ ట్రస్ట్ ఆధ్వర్యంలో వీటిని ఆలయానికి వితరణగా అందజేసినట్లు మునిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యుడు నాగరాజు పాల్గొన్నారు.

28న డీఎస్సీ మోడల్ పరీక్షలు

జమ్మలమడుగు : డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈనెల 28న డీఎస్సీ ఎస్జీటీ అభ్యర్థులకు మోడల్ టెస్టు నిర్వహిస్తామని డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎన్జీవో కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీవైఎఫ్ఐ పోరాటం చేయడం వల్ల రాష్ట్రప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేసిందని తెలిపారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 9912758515 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

సూపర్ సిక్స్.. అట్టర్ ఫ్లాప్

- ఒక్క హామీని నిలబెట్టుకోని చంద్రబాబు
- గాలిలో కలిసిన అన్నదాత సుఖీభవ
- డ్వాక్రా రుణమాఫీదీ అదే తీరు



మహిళలకు వైఎస్సార్ ఆసరా పథకాన్ని అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి (ఫైల్)

కొండాపురం : అధికారం కోసం ఎడాపెడా హామీలివ్వడం.. పీఠం మీద కూర్చున్న తర్వాత హామీలను విస్మరించడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య. ఇలాగే 2014లో అలవి కానీ హామీలిచ్చి గద్దెనెక్కిన తర్వాత వాటిని తొంగలో తొక్కారు. 2019 ఎన్నికల్లో సూపర్ సిక్స్ అంటూ ప్రజలను మభ్యపెట్టి ఓట్లు వేసుకొని అధికారంలోకి వచ్చి 11 నెలలు దాటినా వాటి అమలులో చంద్రబాబు చేతులెత్తేయడంతో అన్ని వర్గాల ప్రజలు మండిపడుతున్నారు.

ఎదురు చూస్తున్న రైతన్న

హామీల అమలు కాక రైతులు, విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వ్యవసాయం కష్టాల సాగుగా మారడంతో ప్రభుత్వ సాయం రైతులకు ముఖ్యంగా మారింది. తాము అధికారంలోకి వస్తే అన్నదాత సుఖీభవ కింద ఏడాదికి రూ.20 వేలు పెట్టుబడి సాయం ఇస్తామంటూ కూటమి నేతలు ఎన్నికల్లో హామీ ఇచ్చారు. పది రోజుల్లో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుంది. ఇప్పటివరకు అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి వెరిఫికేషన్ పూర్తి కాలేదు. సకాలంలో అమలు చేయక పోవడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కౌలుచట్టంలో మార్పులు చేస్తామనే మాటను సైతం ప్రభుత్వం ఇప్పటికీ నెరవేర్చలేకపోయింది. తాము అధికారంలోకి వస్తే కుటుంబంలో చదువుకుంటున్న ప్రతి పిల్లాడికి అమ్మకి వందనం కింద రూ. 15 వేలు చొప్పున ఇస్తామని కూటమి నేతలు చెప్పారు. ఇప్పటివరకూ అమలు కాలేదు. తల్లికి వందనం సొమ్ము లేస్తే పిల్లల ఫీజులకు ఉపయోగపడతాయని తల్లిదండ్రులు ఎదురుచూస్తూనే ఉన్నారు. ఎప్పుడు వేస్తారో కనీసం ప్రకటించని పరిస్థితి నెలకొంది. 19 ఏళ్ళ నుంచి 50 ఏళ్ల మధ్య మహిళలకు నెలకు రూ.1,500 జమ చేస్తామని చెప్పారు. అది ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు ఉంది. ఉద్యోగాలు వచ్చే వరకూ యువతకు నిరుద్యోగ భృతి కింద నెలకు రూ.3 వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. అసలు అమలు చేస్తారా లేదా అనే అనుమానాలు నెలకొన్నాయి.

ఉచిత బస్సు ప్రయాణం ఎప్పుడు?

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై మాటలు తప్ప ఆచరణ లేకుండా పోయింది. సూపర్ సిక్స్ పేరుతో ప్రభుత్వం చెప్పిన కీలక హామీల్లో ఉచిత గ్యాస్ పథకం ఒక్కటే ఇప్పటి వరకూ అమలు చేసిన పరిస్థితి నెలకొంది. ఆరోగ్యశ్రీ పథకానికి సంబంధించి ఆస్పత్రులకు బకాయిలు చెల్లించకపోవడంతో వారు కూడా వైద్యం అందించడం లేదు. దీంతో ఇది కూడా అటకెక్కినట్లే అన్న ఆరోపణ లున్నాయి. ఇంట్లో కుటుంబ యజమాని మృతి చెందితే ఇచ్చే చంద్రన్న బీమా సైతం ఇప్పటికీ అమలుకు నోచుకోలేదు.

జగనన్న ప్రభుత్వ హయాంలో..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లు ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేసి ప్రజా సంక్షేమానికి పెద్ద పీట వేశారు. కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లో కూడా జగనన్న ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసి ప్రజల గుండెల్లో స్థిరస్థాయిగా నిలిచిపోయారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అమ్మ ఒడి, వసతిదీవెన, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, ఈబీసీ నేస్తం, కాపు నేస్తం, రైతు బరోసా, వైఎస్సార్ బీమా తదితర సంక్షేమ పథకాలు అమలు చేశారు. కొండాపురం మండలంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పేదలకు నేరుగా బ్యాంక్ ఖాతాలో సుమారు రూ. 194.4 కోట్లు జమ చేశారు.

హామీలు అమలు చేయాలి



కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలు అమలు చేయడంలో విఫలమైంది. సూపర్ సిక్స్‌లో భాగంగా ఉచిత బస్సు కోసం మహిళలు ఎదురుచుస్తున్నారు. కుటుంబంలో ఎంత మంది ఉంటే అంతమందికి తల్లికి వందనం ఇస్తామని చెప్పి ఏడాది గడుస్తోంది. కూటమి నాయకులు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చాలి.

\- వై. భారతి, జెడ్పీటీసీ, కొండాపురం

పేదలకు న్యాయం చేయాలి



సూపర్‌సిక్స్ హామీలు అమలు చేసి పేదలకు న్యాయం చేయాలి. ఉచిత గ్యాస్ పథకాన్ని సక్రమంగా అమలు చేయడం లేదు. తర్వలో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుంది. ఇప్పటివరకు అన్నదాత సుఖీభవ పథకం ఊసే లేదు. ఎన్నికల హామీలు అమలు చేయాలి. లోటు బడ్జెట్ పేరుతో కాలయాపన చేయడం సరైంది కాదు.

\- బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి, ప్రవీణ్‌యాదవ్

మాట నిలబెట్టుకోవాలి



నోటీసులిచ్చి దీర్ఘగాలిక పింఛన్లు రద్దు చేశారు. ఇప్పుడేమో దివ్యాంగులకు విచారణ పేరుతో పింఛన్‌ను రద్దు చేయాలని చూస్తున్నారు. అన్ని వర్గాలను కూటమి ప్రభుత్వం మోసం చేస్తోంది. అధికారంలో వచ్చి 11 నెలలు అవుతున్నా.. ఒక్క పథకాన్ని కూడా అమలు చేయలేదు. హామీలు అమలు చేసి మాట నిలబెట్టుకోవాలి.

\- చింత నవజ్యోత్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్

ఉపాధి హామీ అక్రమాలను అరికట్టండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రమాదేవి

లింగాల : ఉపాధి హామీ పనులలో జరుగుతున్న అక్రమాలను అరికట్టాలని ఎంపీపీ రమాదేవి పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ రమాదేవి మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనులలో అక్రమాలు జరుగుతున్నాయని, సంబంధిత అధికారలు విచారణ నిర్వహించి అవినీతి, అక్రమాలను అరికట్టాలన్నారు. అదేవిధంగా కో-ఆప్షన్ మెంబర్ మహమ్మద్ రసూల్ ఎంపీడీఓ శ్రీనివాసులరెడ్డికి ఉపాధి హామీ పనులలో అక్రమాలు చోటు చేసుకున్నాయని, వాటిని అరికట్టాలని వినతి పత్రాన్ని అందించారు. అక్రమాలను అధికారులు అరికట్టాలని అర్జీలో పేర్కొన్నట్లు తెలిపారు. అనంతరం డాక్టర్ సుభాషిణి మాట్లాడుతూ లింగాల మండలానికి పబ్లిక్ హెల్త్ యూనిట్ మంజూరైందని, ఇందుకు రూ.50లక్షలు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. పీహెచ్‌సీ స్థలంలోని పాల కేంద్రాన్ని వెంటనే సంబంధిత అధికారులు తొలగింపజేస్తే అక్కడ పబ్లిక్ హెల్త్ యూనిట్ భవనాన్ని నిర్మింపజేయవచ్చునని ఆమె మండలస్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అదేవిధంగా కోమన్నూతలలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఎంపీటీసీ రాజు అధికారులను కోరారు. అంగన్‌వాడీ కేంద్రాలలో తాగునీరు, మరుగుదొడ్ల నిర్మాణాలను వెంటనే చేపట్టాలని, మంజూరైన కొత్త భవనాలను నిర్మించాలని ఐసీడీఎస్ అధికారులు సభ దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులరెడ్డి, తహసీల్దార్ ఈశ్వరయ్య, ఏఓ లోకేశ్వరరావు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామి, తదితర మండలస్థాయి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించండి



మాట్లాడుతన్ను జెడ్పీటీసీ కె.వెంకట బయపురెడ్డి

వేముల : కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని జెడ్పీటీసీ కె.వెంకట బయపురెడ్డి, ఎంపీపీ చల్లా గంగాదేవి పేర్కొన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ చల్లా గంగాదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో అమలయ్యే పథకాల పట్ల ప్రజలకు అవగాహన లేకపోవడంతో పథకాలు అందడంలేదన్నారు. ఇందుకోసం పంచాయతీల వారీగా డ్వాక్రా మహిళలను సమావేశపరిచి పథకాలపై మొగ్గుచూపేలా ప్రోత్సహించాలని సూచించారు. పేదరిక నిర్మూలన కోసం ప్రవేశపెడుతున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వెలుగు అధికారులకు సూచించారు. అలాగే ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపేలా రైతులను ప్రోత్సహించాలన్నారు. వ్యవసాయంలో పెట్టుబడులు పెరిగిపోయి దిగుబడులు తగ్గడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. అదే రైతులను ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారిస్తే తక్కువ పెట్టుబడులతో ఎక్కువ దిగుబడులు సాధించే అవకాశాలపై రైతులకు వివరించాలని సూచించారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. పంచాయతీలలో పారిశుద్ధ్యం లోపించిందని వీధులన్ని మురికి కూపాలుగా మారిపోతున్నాయన్నారు. పంచాయతీలను పరిశుభ్రంగా ఉంచేలా చూడాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. అంతేకాక పామాయిల్ సాగు చేసుకునేందుకు రైతులకు హెక్టార్‌కు రూ.10,400లు సబ్సిడీ ఇస్తారని, ఇప్పటికే కేఎం అనే సంస్థ వేముల మండలంలో ముందుకొచ్చిందన్నారు. పామాయిల్ సాగుపై రైతులకు అవగాహన కల్పించి సాగుకు ముందుకొచ్చేలా చూడాలన్నారు. మండల వ్యాప్తంగా విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఈ శ్రీనివాసులుకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఇందిరారాణి, హెచ్ఓ రాఘవేంద్రారెడ్డి, ఎంపీడీఓ రాధాకృష్ణవేణి, ఏఓ చెన్నారెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ రమేష్ రెడ్డి, పీఆర్ ఏఈ అబ్దుల్లా, ఏపీఎం ఆంజనేయులు, కో-ఆప్షన్ సభ్యులు మండి మాపీరా, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

విద్యార్థినికి బంగారు పతకం



గవర్నర్ చేతుల మీదుగా బంగారు పతకం అందుకుంటున్న వెంకట నాగమణి

చింతకొమ్మదిన్నె : కడప నగరం రాయచోటి రోడ్డులోని అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డేటా సైన్స్ విభాగంలో 2020 - 2024 బ్యాచ్ విద్యార్థిని వి.వెంకట నాగమణి బంగారు పథకం సాధించింది. అకాడమిక్స్‌లో 83.14 శాతం ఉత్తీర్ణత సాధించినందుకు అనంతపురం జవహర్ లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (జేఎన్‌టీయూ) నిర్వహించిన 14వ స్నాతకోత్సవంలో ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ చేతుల మీద ప్రతిష్టాత్మక బంగారు పతకం అందుకున్నారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్ రెడ్డి తెలిపారు. ఈ విద్యార్థినికి అన్నమాచార్య విద్యాసంస్థల అధినేత డాక్టర్ చొప్పా గంగిరెడ్డి, వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, ఈడీ చొప్పా అభిషేక్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్ రెడ్డి కళాశాల ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డేటా సైన్స్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ ఎం.వెంకట రమణ, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

సబ్సిడీపై జనుము విత్తనాలు

చింతకొమ్మదిన్నె : ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న జనుము, విత్తనాలు అవసరమున్న ప్రతీ రైతు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఈశ్వర్‌రెడ్డి సూచించారు. చింతకొమ్మదిన్నె మండలానికి 50 శాతం సబ్సిడీతో పచ్చి రొట్ట విత్తనాలు, జనుములు 50 క్వింటాళ్లు పంపిణీకి మంజూరయ్యాయని తెలిపారు. జనుము విత్తనాల కోసం రైతు సేవా కేంద్రం నమోదు చేసుకోవాలన్నారు. రైతులు తమ పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, మొబైల్ తప్పనిసరిగా తీసుకొని సంబంధిత రైతు సేవా కేంద్రం సిబ్బందిని సంప్రదించి నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ అవకాశాన్ని మండల రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

కమలాపురం : స్థానిక పోస్టాఫీసు ఎదుట ఉన్న శ్రీ సాయి హాస్పిటల్‌లో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రొద్దుటూరుకు చెందిన మమత హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శిబిరం నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ప్రముఖ స్త్రీ వ్యాధి, కాన్పులు, సంతాన సాఫల్య నిపుణురాలు డా. కె. జయసత్య శిబిరానికి వచ్చే మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. తెల్లబట్ట, గర్భ సంచి గడ్డలు, రొమ్ములో గడ్డలు, పేగు జారడం, నెలసరి సమయంలో సమస్యలు తదితర వ్యాధులకు చికిత్సలు చేస్తారని పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

రేపు ప్రముఖ వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్దములు, చెవిలో కర్ణబేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు చికిత్స చేస్తారని తెలిపారు. అలాగే ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కు పోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్సతో పాటు సంబంధించిన అనేక సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎం హెచ్ఓ డాక్టర్ ఖాజా మొహిద్దీన్

పులివెందుల రూరల్ : సీజనల్ వ్యాధులపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఖాజా మొద్దీన్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని స్థానిక అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పీహెచ్‌సీ డాక్టర్లకు, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్లకు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఖాజా మొహిద్దీన్ హాజరై మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు పడుతున్నాయని, నీరు నిలిచి దోమలు వృద్ధి చెంది జ్వరాలు వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఫీవర్, లార్వా సర్వేలు నిర్వహించాలని సూచించారు. ఎవరికైనా జ్వరంతో బాధపడుతుంటే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి రక్తపరీక్షలు చేయించుకుని వ్యాది నిర్ధారణ చేయించుకొని చికిత్స చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ స్నేహ ప్రత్యూష, డాక్టర్ శాంత కుమార్, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సిద్ధయ్య, వైద, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మాన్యం భూముల కౌలుకు వేలం



పెద్దపసుపులలో కౌలు వేలం నిర్వహిస్తున్న దృశ్యం

పెద్దముడియం : మండలంలోని పెద్దపసుపుల గ్రామంలోని శ్రీ మాధవ-ఆంజనేయ, శ్రీ ఈశ్వర-వీరభద్ర ఆలయాల మాన్యం భూములకు ఆలయ అధికారులు వేలం పాట నిర్వహించారు. ఆలయాలకు చెందిన 197 ఎకరాలను మూడు సంవత్సరాల కౌలుకు ఇచ్చామని అధికారులు తెలిపారు. శ్రీ మాధవ-ఆంజనేయ ఆలయానికి సంబంధించిన 145 ఎకరాలకు గాను 15,82,000, శ్రీ ఈశ్వర-అంజనేయ ఆలయానికి సంబంధించిన 54 ఎకరాలకు గాను 6,18,000 లక్షలు వేలంలో పలికినట్లు ఈఓ విశ్వనాథరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో దేవాలయ అధికారులు, రైతులు, ఎస్ఐ సుబ్బారావు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ తప్పనిసరి



లక్ష్మీదేవమ్మను సన్మానిస్తున్న ఎంపీపీ రమాదేవి, ఎంపీడీఓ శ్రీనివాసులరెడ్డి

లింగాల: ప్రతి ఉద్యోగికి ఉద్యోగ విరమణ తప్పనిసరి అని ఎంపీడీఓ శ్రీనివాసులరెడ్డి తెలిపారు. లింగాల ఎంపీడీఓ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తున్న లక్ష్మీదేవమ్మ పదవీ విరమణ పొందారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఘనంగా ఆమెను సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ లక్ష్మీదేవమ్మ అందించిన సేవలు మరువలేనివన్నారు. కార్యాలయానికి వచ్చే సామాన్య ప్రజలను సైతం ఆప్యాయంగా పలకరించి అందరి మన్ననలు పొందారని కొనియాడారు. పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'బోగస్ పింఛన్లు తొలగించమని ఎవరికీ అర్జీ ఇవ్వలేదు'

వేముల : మండలంలోని పెద్దజూటూరు గ్రామంలో ఉన్న బోగస్ పింఛన్లు తొలగించాలని ఏ అధికారికి వినతి పత్రం ఇవ్వలేదని గ్రామ సర్పంచ్ రామలక్షుమ్మ, భర్త నారాయణస్వామి తెలిపారు. పెద్దజూటూరు గ్రామంలో బోగస్ పింఛన్‌లను తొలగించాలని అధికారులకు అర్జీ ఇచ్చినట్లు కొంతమంది సర్పంచ్ భర్త నారాయణస్వామి పేరుతో కరపత్రాలు పంపిణీ చేశారు. ఇందుకు స్పందించిన నారాయణస్వామి స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం సాక్షితో మాట్లాడారు. గ్రామంలో బోగస్ దివ్యాంగుల సర్టిఫికెట్లు తెచ్చుకుని పింఛన్లు తీసుకుంటున్నారని, ఈ సర్టిఫికెట్లు అందరి వద్ద డబ్బులు తీసుకుని సర్టిఫికెట్లు ఇచ్చారని, వీరికి గురువారం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో దివ్యాంగ సర్టిఫికెట్ల నిజమైనవని సర్టిపై చేసిన డాక్టర్‌పై కోర్టుకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని కరపత్రాలు పంపిణీ చేశారని తెలిపారు. ఎవరో గ్రామంలో ఘర్షణ వాతావరణం సృష్టించేందుకు ఇలాంటి కరపత్రాలు పంపిణీ చేశారని, అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న ఎండీయూ వాహనాల ఆపరేటర్లు

సింహాద్రిపురం : ఉద్యోగ భద్రత కల్పించాలని ఎండీయూ వాహన ఆపరేటర్లు కోరారు. మండల కేంద్రమైన సింహాద్రిపురంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం తహసీల్దార్ నాగేశ్వరరావుకు ఎండీయూ వాహన ఆపరేటర్లు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇంటింటికి రేషన్ బియ్యం పంపిణీ చేసేందుకు మండల వ్యాప్తంగా 8 వాహనాలను ఏర్పాటు చేసిందని, వాహన కంతుకు, వాహన ఆపరేటర్‌కు నెలకు దాదాపు రూ.21వేలు అప్పటి ప్రభుత్వం జీతం ప్రకటించిందన్నారు. అప్పటి నుంచి ఇంటింటా రేషన్ సరుకులు పంపిణీ చేస్తూ ఉండేవారమని, కానీ కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక కష్టాలు మొదలయ్యాయని వాపోయారు. ఇప్పుడు ఉన్నఫలంగా కూటమి ప్రభుత్వం ఎండీయూ వాహనాలను వచ్చే నెల 1వ తేదీ నుంచి తొలగించినట్టు ప్రకటించడంతో తమ జీవితాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు.

నేడు హనుమజ్జయంతి వేడుకలు

- అంజన్న ఆలయాల్లో అన్నదానం
- హనుమాన్ శోభా యాత్ర



ఆంజనేయస్వామి మూలవిరాట్

పులివెందుల టౌన్ : పులివెందుల పట్టణంలో హనుమజ్జయంతి సందర్భంగా గురువారం పులివెందుల పట్టణంలోని పాత సంత మార్కెట్‌లోని శ్రీ పడమటి ఆంజనేయ స్వామి ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలతోపాటు ఆకు పూజలు నిర్వహించనున్నారు. అలాగే భక్తులందరికీ అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అదేవిధంగా పట్టణంలోని హనుమద్ ఆలయాలలో ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. హనుమజ్జయంతి సందర్భంగా నిర్వహించే హనుమాన్ శోభా యాత్ర కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ తరలిరావాలని హిందు ఐక్యవేదిక, ఆంజనేయస్వామి దేవస్థాన కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు. గురువారం సాయంత్రం 5.30 గంటలకు ఆర్టీసీ బస్టాండు వద్ద గల పీబ్ల్యూబీ కాలనీ ఆంజనేయస్వామి ఆలయం వద్ద నుండి శోభా యాత్ర అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గాంధీ సర్కిల్, కచేరి రోడ్డు, పూలంగళ్లు, మీదుగా పాత బస్టాండ్ వరకు శోభా యాత్ర కొనసాగుతుందన్నారు. శ్రీ హనుమాన్ శోభా యాత్రను విజయవంతం చేయాలని కోరారు.

బ్రాహ్మణపల్లె గ్రామంలో..

గురువారం హనుమజ్జయంతి సందర్భంగా పట్టణంలోని తూర్పు ఆంజనేయస్వామి, పడమటి ఆంజనేయస్వామి, కోతి సమాధి ఆంజనేయస్వామి, బ్రాహ్మణపల్లె గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయాలలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాల వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

లింగాల : మండలంలోని పార్నపల్లె కోనమల్లేశ్వరస్వామి దేవస్థానంలోని ఆంజనేయస్వామికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. హనుమజ్జయంతి సందర్భంగా ఆంజనేయస్వామికి 1,008 అరటిపండ్లతో అర్చన కార్యక్రమాలు జరుగుతాయని, భక్తులందరూ స్వామివారిని పూజా కార్యక్రమంలో పాల్గొని స్వామివారి అనుగ్రహం పొందాలని వారు కోరారు.

సింహాద్రిపురం : మండలంలోని నిడివెల్లలోని ఆంజనేయస్వామి ఆలయం, బలపనూరు, తదితర గ్రామాల్లోని ఆంజనేయస్వామి ఆలయాల్లో గురువారం హనుమజ్జయంతిని పురస్కరించుకుని స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు. భక్తులు హనుమజ్జయంతి వేడుకల్లో పాల్గొని స్వామివారి అనుగ్రహం పొందాలని వారు కోరారు. అలాగే బలపనూరు గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

వేంపల్లె : వేంపల్లెలోని స్థానిక శ్రీ వృషభాచలేశ్వర స్వామి దేవస్థానం అనుసంధానంలో గల శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో హనుమజ్జయంతి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయని ఆలయ ఈఓ విశ్వనాథ రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా బుధవారం 2వ రోజు ఆలయంలో అర్చకులు హరిప్రవీణ్ నేతృత్వంలో ఉదయం విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, మహాకుంభ ఉపకుంభ, ఆరాధన, రామాయణ గాయత్రి హోమం, రామాయణ మూలమంత్ర హోమం, పురుషసూక్తం, మూలవర్లకు పంచామృతాభిషేకం అనంతరం విశేష అలంకారం, అర్చన మహామంగళ హారతి, సాయంత్రం ద్వారారధన, మహాకుంభ ఆరాధన, మన్యుసూక్త ధన్వంతరి హోమం, హనుమ మూల మంత్ర హోమం, సుదర్శన హోమం, అర్చన, మహా మంగళహారతి, తదితర విశేష పూజలు నిర్వహించామన్నారు.

వేడుకలకు ఏర్పాట్లు పూర్తి

వల్లూరు (చెన్నూరు) : మండల కేంద్రమైన చెన్నూరు బ్రాహ్మణ వీధితోపాటు బుడ్డాయిపల్లి ఆంజనేయ స్వామి ఆలయంలో గురువారం నిర్వహించే హనుమాన్ జయంతి వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించడంతోపాటు, భక్తుల సౌకర్యార్థం చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. ఉదయం 5 గంటల నుంచి స్వామి వారికి సుప్రభాత సేవలు, అభిషేకాలతో పాటు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరిస్తారని తెలిపారు. అనంతరం ఎనిమిది గంటల నుండి భక్తులకు సర్వదర్శనం కల్పిస్తామన్నారు. భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

వీరపునాయునిపల్లె : మండల కేంద్రమైన వీరపునాయునిపల్లె, సంగాలపల్లె, యరమలపల్లె, బుసిరెడ్డి పల్లె, ఎస్. పాలగిరి గ్రామాల్లో గురువారం హనుమజ్జయంతి వేడుకలు నిర్వహించేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయాలకు రానుండటంతో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టారు. పలు ఆలయాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నారు.